సాక్షి
జనగామ
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



మేడారానికి బస్సు చార్జీలు ఖరారు
మేడారం జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు ఆర్టీసీ యాజమాన్యం చార్జీలు ఖరారు చేసింది. ఈనెల 18నుంచి ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. - 8లో▸



ఎక్సైజ్, పోలీస్‌శాఖలో బదిలీలు
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఎక్సైజ్, పోలీస్ శాఖలో భారీగా బదిలీలు చేస్తూ ఉత్తరులు జారీ చేశారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$33^0/18^0$
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా సరిత



జనగామ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా డి.సరితను నియమిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎన్.వసంత వికారాబాద్ డిప్యూటీ సీఈఓగా బదిలీ అయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో సరిత విధుల్లో చేరనున్నారు.

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత..



జనగామ: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా అనితను నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూర్యాపేటలో విధులు నిర్వర్తిస్తున్న ఆమెను జనగామకు బదిలీ చేయగా.. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణప్రియను శంషాబాద్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో అనిత బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇంటి స్థలాల నివేదిక ప్రభుత్వానికి పంపిస్తాం..

జనగామ: ఉద్యోగులకు సంబంధించి ఇంటి స్థలాలకు నివేదిక ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. టీఎన్‌జీఓ యూనియన్ 2024 సంవత్సర నూతన డైరీని ఆయన కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖాజాషరీఫ్ మాట్లాడుతూ.. ఇంటి స్థలాల కోసం 25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ రామ్మూర్తి పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన నవోదయ స్కూల్ విద్యార్థి గట్టు సూర్యగౌడ్ ఇటీవల హన్మకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 44 కిలోల విభాగంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా సూర్యగౌడ్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక





కొడకండ్ల/నర్మెట : సూర్యాపేటలో ఈనెల 16న జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు కొడకండ్ల టీఎస్ఆర్ఎస్‌కు చెందిన ఊర సంతోష, నర్మెట మండలం మల్కపేటకు చెందిన సాహితీ జూనియర్ కళాశాల విద్యార్థి కన్నారపు సాయిరాం ఎంపికయ్యారు. ఇటీవల జనగామలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల బాధ్యులు తమ్మి దిలీప్‌కుమార్, పీఈటీలు రాయవేని లలిత, సురేందర్, కోచ్ మోహన్ తదితరులు వారిని వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అభినందించారు.

పెంబర్తి వద్ద సీఎంకు స్వాగత ఏర్పాట్లు

జనగామ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని మేడిగడ్డ పర్యటనకు మంగళవారం వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లాలోని పెంబర్తి ముఖద్వారం వద్ద ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు సీఎం పెంబర్తికి చేరుకున్న సమయంలో కార్యకర్తలు ర్యాలీగా చేరుకుని స్వాగతం పలుకుతారని జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే సీఎం.. హస్త కళలకు జాతీయ స్థాయి గుర్తింపు పొందిన పెంబర్తి గ్రామంలో కళాకారుల నైపుణ్యాన్ని చూసే అవకాశం ఉందని తెలిసింది. ఇందుకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టి బాంబ్ స్క్వాడ్‌తో పర్యవేక్షిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక సాధికారత, అసాధారణ పరిస్థితుల్లో అత్యుత్తమంగా పనిచేసిన మహిళలకు అవార్డులు అందించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వెబ్‌సైట్‌తోపాటు హైదరాబాద్‌లోని తమ శాఖ సంచాలకుల కార్యాలయం, 8–3–222, వెంగళరావునగర్, మధురానగర్ మెట్రోస్టేషన్, అమీర్‌పేట్ చిరునామాకు ఈనెల 18వ తేదీలోగా పోస్ట్ చేయాలని సూచించారు.

ఆలకిస్తూ.. ఆదేశిస్తూ..

- గ్రీవెన్స్‌కు 60 వినతులు
- స్వీకరించిన కలెక్టర్, అధికారులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్లు అర్జీదారుల సమస్యలు ఆలకిస్తూ.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 60 వినతులు రాగా.. అందులో అధికంగా భూమి సంబంధిత, సదరం సమస్యలే ఉన్నాయి. ఆర్డీఓ పరిధిలో 26, రెవెన్యూ విభాగానికి 12, డీఆర్‌డీఓ 9, డీపీఓ 5, ఉపాధి శాఖకు 2, సివిల్ సప్లయ్ ఏసీపీ, హౌసింగ్, బీసీ వెల్ఫేర్, ఎస్‌డీసీ, మున్సిపల్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు



పక్క ఫొటోలోని బాలిక పేరు పోషపోయిన ఇందు(10). బచ్చన్నపేట మండలం కొడవటూర్‌కు చెందిన ఈమెకు పుట్టుకతో నడుముకు పోలియో వచ్చింది. మొదట్లో పూర్తిగా నడవరాకపోవడంతో డాక్టర్ల వద్ద చికిత్స చేయించగా కొంత నయమైంది. దివ్యాంగుల పింఛన్ కోసం సదరం స్లాట్ కావడం లేదు. 'నాలుగేళ్ల నుంచి తిరుగుతున్నా సర్టిఫికెట్ రాలేదు.. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి' అని బాలిక తండ్రి నూతనప్రసాద్ వేడుకున్నాడు.



పక్క ఫొటోని దివ్యాంగుడి పేరు ఏనుగుతల నాగారాజు. పాలకుర్తికి చెందిన ఈయన డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో జీ నెట్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్ బేగంపేట ఆఫీస్‌లో ఉద్యోగం రాగా.. వసతి కల్పనకు సహకరించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. స్పందించిన కలెక్టర్.. సంబంధిత కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి షెల్టర్ కల్పించేలా చూడాలని వివరాలు అందజేశారు.

మద్యం షాపులతో ఇబ్బంది..



లింగాలఘణపురం మండలం నెల్లుట్ల జనాభా ఆరు వేల వరకు ఉంటుంది. గ్రామంలో ఇప్పటికే మూడు వైన్ షాపులు ఉన్నాయి. వీటికితోడు వార్డుల్లో 30 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఉదయం 5 గంటల నుంచి బెల్టుషాపులు తెరుస్తుండడంతో మద్యం సేవించే వారితో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణం బెల్ట్ షాపులను అరికట్టాలని స్థానికులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అనర్హులకు డబుల్ బెడ్రూంలు..



దేవరుప్పుల మండలం కొత్తవాడలో 20 డబుల్ బెడ్రూంలు కట్టించారు. కొన్ని ఇళ్లను ఆక్రమించి అనర్హులకు కేటాయించారు. ఏ ఆధారం లేని నిరుపేదలు ఉన్నా అధికారులు పట్టించుకోకుండా ఇతరులకు ఇచ్చారు. ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని చెప్పినా సర్వే చేయలేదు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పెన్షన్ రావడం లేదు



ఎస్సీ హాస్టల్‌లో 2020 సంవత్సరం హెచ్‌డబ్ల్యూఓగా రిటైర్ అయ్యాను. గతంలో ఓ కేసు విషయంలో తనకు రావలసిన బెనిఫిట్స్ రాలేదు. కోర్టు తీర్పు ప్రకారం 75శాతం పెన్షన్ ఇవ్వాలని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయినా రావడంలేదు. 18 నెలల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. సమస్యను పరిష్కరించి పెన్షన్ వచ్చేలా చూడాలి.

- డిజోషి ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌డబ్ల్యూఓ

8 నెలల నుంచి జీతాలు లేవు



హాస్టల్‌లో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 8 నెలల నుంచి జీతం రాక ఇబ్బంది పడుతున్నాం. పండుగ లేదు పబ్బం లేదు.. వెట్టిచాకిరీ చేసినట్లు ఉంది. అధికారులను అడిగితే పట్టించుకోవడంలేదు. బ్యాంకులో వేతనాలు పడి కూడా ఐదు నెలలవుతున్నా ఇవ్వడం లేదు.

- రజిత, ఘన్‌పూర్ ఎస్సీ హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్

10 గుంటల భూమి ఆక్రమించారు..



నా పేరుమీద గ్రామంలోని 823 సీ2, 825బై 7,824బై2 సర్వే నంబర్లలో 2 ఎకరాల 37 గుంటల భూమి ఉంది. నేను గ్రామంలో లేనిది చూసి నా సోదరుడు, అతడి కుమారులు 10 గుంటల భూమి ఆక్రమించి బోరు వేసుకున్నారు. అడిగితే బెదిస్తున్నారు. అధికారులకు చెబితే సయోధ్యకు రావాలని ఆదేశాలు ఇస్తున్నారు. న్యాయం చేయాలి.

- గుంటి గట్టయ్య, నమిలిగొండ(స్టేషన్‌ఘన్‌పూర్)

ఎస్ఆర్‌లో చేర్చడం లేదు..



వాచ్‌మన్ విధులు నిర్వహిస్తుండగా 317 జీఓలో భాగంగా మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. 2016 నుంచి 2021 వరకు ఈఎల్ఎస్‌ను ఎస్ఆర్‌లో చేర్చడం లేదు. ఆరేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తే రెండ్రోజుల్లో పరిష్కరిస్తామని సంక్షేమాధికారి చెబుతున్నారు.

- అరూరి శ్రీనివాస్, వాచ్‌మన్, బాలుర ఎస్సీ హాస్టల్(బీ), స్టేషన్‌ఘన్‌పూర్

సీఎం పర్యటనకు 'మేడిగడ్డ' సిద్ధం



వేదిక వద్దకు ఏర్పాటు చేస్తున్న రోడ్డు



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, పోలీసు అధికారులు

- రేవంత్‌రెడ్డితోపాటు రానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- బ్యారేజీ పరిశీలన, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- కలెక్టర్, ఐజీ, ఎస్పీల ఆధ్వర్యంలో ఏర్పాట్ల పరిశీలన
- 'ముఖ్యుల' పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు

కాళేశ్వరం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, లోపాలు బయటికి తీసేందుకు ప్రాజెక్టును సందర్శిస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈ మేరకు మంగళవారం మేడిగడ్డలో పర్యటించనున్నారు. ప్రాజెక్టు లోపాలను ప్రజలకు పూర్తిగా వివరించనున్నారనే నేపథ్యంలో సీఎం పర్యటన ఖరారైంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మేడిగడ్డ వద్ద ఏర్పాట్లు చేసింది. సీఎంతోపాటు ముఖ్యులు వస్తుండడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. నేడు(మంగళవారం) ఉదయం 10.15గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్సుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతరశాఖల ఉన్నతాధికారులు రోడ్డు మార్గంలో మేడిగడ్డకు బయలుదేరుతారు. సాయంత్రం 3.30గంటలకు బ్యారేజీకి చేరుకుని 7వ బ్లాక్‌లో ఏర్పడ్డ పగుళ్లు (గత అక్టోబర్ 21న కుంగినప్పుడు), 19, 20, 21, 22 పియర్‌లను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. గంటపాటు ఈ పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత బ్యారేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టుపై ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రజలకు వివరించనున్నారు. రాత్రి 7గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. కాగా, సీఎం, కొంతమంది మంత్రులు తిరుగు ప్రయాణంలో హెలికాప్టర్‌లో వెళ్లనున్నట్లు తెలిసింది. హెలిపాడ్‌లు కూడా సిద్ధం చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఐజీ, ఎస్పీ..

మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లను సోమవారం భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఐజీ శ్రీనివాస్, ఎస్పీ కిరణ్‌ఖరే, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావు, ఎల్అండ్‌టీ ప్రతినిధులు పరిశీలించారు. సభాస్థలి వద్ద రోడ్డు ఏర్పాటు చేశారు. అక్కడే సుమారు 2,500మంది వీవీఐపీలు కూర్చునేందుకు వేదిక ముందు టెంట్లు వేశారు. వీవీఐపీలు బస్సుల్లో వచ్చేందుకు మహదేవపూర్–కాళేశ్వరం జాతీయ రహదారి గుండా కుదురుపల్లి మీదుగా రోడ్డు మార్గాన వెళ్లేందుకు సిద్ధం చేశారు. వెళ్లడం, తిరిగి వచ్చే మార్గాలు ఒకే రోడ్డు గుండా కావడంతో అధికారులు పూర్తి భద్రతాచర్యలు చేపట్టారు. రోడ్డు డ్యామేజీ ఉన్న చోట మరమ్మతులు చేపట్టారు. ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, జర్నలిస్టులకు వేర్వేరుగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమర్జెన్సీ కోసం వైద్యాధికారులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. సీఎం వ్యక్తిగత భద్రతా అధికారి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బృందం, అధికారులు సుమారు 40 ప్రత్యేక వాహనాల్లో వస్తున్న క్రమంలో బందోబస్తు పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. బ్యారేజీ దిగువ కాఫర్ డ్యాం వద్దకు మీడియాను ముందే అనుమతించాలన్నారు.

భారీ బందోబస్తు..

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీ వద్దకు సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతరశాఖల ఉన్నతాధికారులు రానుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నలుగురు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 45 మంది ఎస్సైలు, 800 వరకు కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో ఉంటారని తెలిసింది. ఇప్పటికే గ్రేహౌండ్స్ బృందాలు అడవులు, సరిహద్దుల్లోని తీర ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి.

సీఎం హోదాలో...



సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మొదటిసారి మేడిగడ్డ పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గతేడాది నవంబర్ 2న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ మేడిగడ్డకు వచ్చారు. సీఎం అయిన తర్వాత మేడిగడ్డ బ్యారేజీని సీరియస్‌గా తీసుకొని గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపించడానికి రానున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- తనిఖీలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

జనగామ: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై 'తోడేస్తున్నారు' శీర్షికన ఈనెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా వాగుల నుంచి తరలిస్తున్న ఇసుకపై నిఘా పెంచాలని రెవెన్యూ విభాగం అదనపు(ఏసీ) కలెక్టర్ రోహిత్ సింగ్‌కు సూచించారు. ఇసుక తరలింపుతో జిల్లాలో భూగర్భజలాలు ప్రమాదకర స్థితికి పడిపోతున్నాయని, రెవెన్యూ, మైనింగ్ విభాగాలు ఆ దిశగా తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ఇంటి నిర్మాణాల పేరిట అడ్డదారుల్లో టోకెన్లు తీసుకుంటూ ఇసుకను తోడేస్తూ ప్రైవేటుగా అమ్ముకుంటున్నారనే విషయంపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరినట్టు తెలుస్తున్నది. 'సాక్షి' కథనంతో ఇసుక మాఫియా అప్రమత్తమైంది. ట్రాక్టర్లను ఇళ్లకే పరిమితం చేశారు. రెండు రోజుల తర్వాత తిరిగి తోడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నిఘా వర్గాల ఆరా..

జనగామ, పాలకుర్తి, లింగాలఘణపురం, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, బచ్చన్నపేట, జఫర్‌గఢ్, దేవరుప్పుల తదితర మండలాల నుంచి ఇసుక అక్రమ రవాణా వెనుక ఎవరున్నారనే దానిపై నిఘా వర్గాలు కూపీ లాగుతున్నట్లు సమాచారం. ఇసుక తరలింపునకు మండలాల వారీగా ప్రతి నెలా మా మూళ్ల రూపంలో రూ.15లక్షల వరకు ముడుతున్నట్లు తెలుస్తోంది.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

బ్రిడ్జి పిల్లర్లకు పొంచిఉన్న ముప్పు..

జిల్లా పరిధిలోని వాగులపై రైల్వే, రోడ్డు రవాణాకు సంబంధించి బ్రిడ్జి నిర్మాణాలు ఉన్నాయి. వీటి సమీపంలో ఇసుక తోడేస్తుండడంతో బ్రిడ్జి పిల్లర్లకు ప్రమాదం పొంచి ఉంది. దీనిపై దక్షిణ మధ్య రైల్వేతో పాటు రోడ్డు రవాణా శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సీసీ కేడెట్‌కు ఘన స్వాగతం

జనగామ: ఢిల్లీలో గత నెల జరిగిన గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక విభాగం నుంచి పాల్గొని జిల్లాకు చేరుకున్న జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 10టీ బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్ కడారి శివకుమార్‌కు సోమవారం ఘన స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర నర్సయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ కార్యాలయం నుంచి పూలవర్షం కురిపిస్తూ ర్యాలీగా కళాశాలకు చేరుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శివకుమార్‌తో పాటు అతడి తల్లిదండ్రులను సత్కరించారు. శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, వైస్ ప్రెసిడెంట్ జగదీష్ ధన్‌కర్, చీఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, డిఫెన్స్ మినిస్టర్ రాజ్‌నాథ్ సింగ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రివాల్‌తో కలిసి తేనీటి విందులో పాల్గొనడం జీవితంలో మరచి పోలేని అనుభూతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అండర్ ఆఫీసర్ హరిప్రసాద్, జూనియర్ అండర్ ఆఫీసర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

'జలదోపిడీ నివారణలో ప్రభుత్వ వైఫల్యం'

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


దేవరుప్పుల: నాగార్జునసాగర్ జలదోపిడీని నివారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం సీతారాంపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నీళ్ల వాటా పరిరక్షణలో బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని, ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా కృష్ణాజలాల వ్యవహారాన్ని అప్పనంగా కేంద్ర జల వనరులకు అప్పగించి చేతులెత్తేసిందని విమర్శించారు. వాస్తవాలను వక్రీకరించి కేసీఆర్‌పై బురదజల్లడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషమ్, కొల్లూరి సోమన్న, సుడిగెల హన్మంతు, చింత రవి, అనంతోజు కృష్ణమూర్తి, అర్జున్, బస్వ వెంకన్న పాల్గొన్నారు.

పొలిటికల్.. పోలీస్!

- బదిలీలు, పోస్టింగుల్లో చెట్టాపట్టాల్!
- ఎమ్మెల్యేలు లేనిచోట ముఖ్యనేతల జోక్యం
- కేయూసీ పోస్టింగ్‌కు బ్రేక్... పరకాల డివిజన్‌లో మరోచోట
- ఏ ప్రభుత్వమున్నా పోస్టింగ్‌లు ఆ కొందరికే ..
- సీఎం, డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదులు
- పోలీస్‌శాఖలో బదిలీలు, పోస్టింగ్‌ల రచ్చ

సాక్షిప్రతినిధి, వరంగల్:

పోలీస్‌శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు, పోస్టింగ్‌లపై రచ్చ నడుస్తోంది. కొందరు పోలీసులు, పొలిటికల్ లీడర్లు చెట్టాపట్టాలు వేసుకున్నారా? అన్న చందంగా సాగిన ఈ ప్రక్రియపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కోరుకున్నచోట, నగర పోస్టింగ్‌లను కొందరు ఇన్‌స్పెక్టర్‌లు కైవసం చేసుకోవడంపై సహచర ఇన్‌స్పెక్టర్లే విస్తుపోతున్నారు. 'బదిలీలు, పోస్టింగ్‌ల్లో లెటర్లు లేవు.. సిఫారసులు లేవు.. పారదర్శకత, పనితీరుకు పెద్దపీట వేస్తాం' అని ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా ఉంటుందని ప్రకటనలు చేశారు. అయితే ఈ నెల 7, 9 తేదీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన 38 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఇవేమీ కనిపించలేదంటున్నారు. పలువురి పోస్టింగుల వెనుక రాజకీయ ప్రమేయం ఉందన్న చర్చ బహిరంగంగానే జరుగుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయూసీ ఎస్‌హెచ్‌ఓగా శ్రీధర్‌కు పోస్టింగ్ పడగా, ఆ మరుసటి రోజే వద్దని చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 6న తొమ్మిది, 11న ఏడుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ, పోస్టింగ్‌లు జరగ్గా అందులో సగానికిపైగా రద్దు చేశారు. ఖమ్మం సీటీసీలో ఉన్న సర్వయ్య అనే ఇన్‌స్పెక్టర్‌కు సోమవారం మహబూబాబాద్ రూరల్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ బదిలీలు, పోస్టింగ్‌ల వెనుక పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారాయన్న చర్చ పోలీస్‌వర్గాల్లో సాగుతుండటం వివాదస్పదం అవుతోంది.



లేఖలు, సిఫారసులు.. ఇవే ప్రామాణికం..

వరంగల్ కమిషనరేట్‌తోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగిన పలువురు సీఐల బదిలీలు, పోస్టింగ్‌ల వెనుక లేఖలు, సిఫారసులే ప్రామాణికంగా మారాయన్న చర్చ పోలీస్ వర్గాల్లో ఉంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కీలక ఠాణాల్లో పోస్టింగ్‌లు సంపాదించిన చాలామంది ప్రస్తుత ప్రభుత్వంలోనూ కోరుకున్న స్టేషన్లు సాధించారన్న ప్రచారం జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో జరిగిన సుమారు 38 ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో సగం మందికిపైగా ఇదే తరహాలో పోస్టింగ్ పొందినట్లు చెబుతున్నారు. రాజకీయ పలుకుబడి, అండదండలు లేకపోవడం వల్ల ఏళ్ల తరబడిగా లూప్‌లైన్‌లో ఉద్యోగం చేస్తున్న వారికి ఈ ప్రభుత్వం హయాంలోనే మొండిచెయ్యేనన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఓ కీలక ప్రజాప్రతినిధి వరంగల్‌తోపాటు జనగామ జిల్లా ఠాణాల్లో పోస్టింగ్‌లపై జోక్యం చేసుకునే ప్రయత్నాన్ని అక్కడి కాంగ్రెస్ సీనియర్ నేత సీరియస్‌గా అడ్డుకున్నారన్న ప్రచారం ఉంది. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన కొందరు ఇన్‌స్పెక్టర్లు వరంగల్ కమిషనరేట్ పరిధిలో కీలక ఠాణాల్లో పాగా వేయడం వెనుక ఓ సీనియర్, మరో మాజీ పోలీసు ఉన్నతాధికారులు చక్రం తిప్పారన్న చర్చ కూడా జరుగుతోంది. మరికొందరు పోలీసు ఇన్‌స్పెక్టర్ల బదిలీలు, పోస్టింగ్‌ల కోసం వివిధ వర్గాలకు చెందిన వారు మాఫియాగా ఏర్పడి ప్రజాప్రతినిధులతో మంతనాలు జరిపి సక్సెస్ అయ్యారన్న ప్రచారం కూడా ఉంది. కాగా ఇటీవల జరిగిన బదిలీలు, పోస్టింగ్‌లపై డీజీపీ, ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో ఆయా ఠాణాల్లో పోస్టింగ్‌లు పొందిన ఇన్‌స్పెక్టర్ల గురించి ఆరా తీస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడెక్కడ పనిచేశారు? గతంలో పనిచేసిన చోట కాంగ్రెస్ కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరించారా? ఆ కారణం చేతనే ఇతర జిల్లాల నుంచి కమిషనరేట్ పరిధిలోకి వచ్చారా? తదితర కోణాల్లో వివరాలు సేకరిస్తుండటం కలకలంగా మారింది.

ఆ మూడు ఠాణాలకు త్వరలో పోస్టింగ్‌లు..

కమిషనరేట్ పరిధిలోని మరో మూడు కీలక పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ల స్థానంలో కొత్త వారికి పోస్టింగ్‌లు తప్పదంటున్నారు. ఇప్పటికే కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు బదిలీ అయినా ఇంకా ఎవరిని నియమించలేదు. ఆలస్యమైనా కమలాపూర్, ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, ప్రవీణ్‌కుమార్‌లకు స్థానచలనం ఉంటుందంటున్నారు. ఆ మూడు ఠాణాల్లో పనిచేస్తున్న ఒకరు సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధిని కలిసి కొద్దిరోజులు కొనసాగేలా అవకాశం కల్పించాలని కోరినట్లు ప్రచారం. కాగా కాజీపేట, కమలాపూర్ పోలీస్‌స్టేషన్లకు ఎస్‌బీలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల పేర్లు ఇప్పటికే ఖరారైనట్లు కూడా చెబుతున్నారు.

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ బిరుదు రాజు రోహిత్‌రాజ్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారిని అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీలు

జనగామ: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను కలెక్టర్ శివలింగయ్య, ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ ఈవీఎం కన్సల్టెంట్ లె.ప్రసాద్ తనిఖీ చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎంల గోదాంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 3,785 ఈవీఎం, బ్యాలెట్ యూనిట్ల తనిఖీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కలెక్టర్ సుహాసిని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి, విజయభాస్కర్, ప్రవీణ్, అజయ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీ చేస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

ఐటీడీఏ పీఓ అంకిత్ బదిలీ


చిత్రమిశ్రా, పీఓ, ఐటీడీఏ

ఏటూరునాగారం : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పీఓ అంకిత్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎం శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజమాబాద్ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తిస్తున్న చిత్ర మిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా, అంకిత్‌ను నిజమాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కాగా, మేడారం జాతర సమయంలో పీఓ బదిలీ చర్చగా మారింది. అంకిత్ 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తొర్రూరు : లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లకు చెందిన షేక్ యాకూబ్ అలీ(57) స్క్రాప్ బిజినెస్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన ద్విచక్రవాహనం మరమ్మతు నిమిత్తం తొర్రూరుకు చేరుకున్నాడు. వాహన మరమ్మతు అనంతరం ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి వచ్చాడు. ఈ క్రమంలో ఖమ్మం వైపునకు అతి వేగంతో వెళ్తున్న లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో షేక్ యాకూబ్ అలీకి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు షేక్ యాసిన్ పాషా ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిచ్చెన పైనుంచి పడి విద్యార్థి..


తేజ (ఫైల్)

వాజేడు: నిచ్చెనపైనుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా వాజేడు మండలం కడేకల్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎర్ర హరినాథ్, కృష్ణ వేణి దంపతుల పెద్ద కుమారుడు తేజ(9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి నిచ్చెన ద్వారా పొరిగింటి వారి డాబా(ఇల్లు)పైకి ఎక్కి ఆడుకున్నాడు. అనంతరం దిగుతున్న క్రమంలో నిచ్చెన విరగడంతో కింద పడ్డాడు. ఆ సమయంలో నిచ్చెనకు సంబంధించిన కర్రలు తేజ మర్మాంగాలకు బలంగా తగిలాయి. దీంతో కుటుంబీకులు 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లిదండ్రులు, బంధువులు.. తేజ మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు. తేజకు తమ్ముడు, చెల్లి ఉన్నారు.

ఎస్సై దురుసు ప్రవర్తన?

ఖిలా వరంగల్ : తనపై మిల్స్‌కాలనీ ఎస్సై దురుసుగా ప్రవర్తించారని వరంగల్ శివనగర్‌కు చెందిన ఓ మహిళ ఆరోపించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో తాను ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసులు.. తన భర్త ఫిర్యాదుపై మాత్రం స్పందించి తనను స్టేషన్‌కు పిలిచారన్నారు. మహిళ అని కూడా చూడకుండా తనపై ఎస్సై దురుసుగా ప్రవర్తించి బైక్ తాళం లాక్కున్నారని సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ఈ ఘటనపై ఎస్సై రాజును వివరణ కోరగా భార్య తరుపు బంధువులు కొట్టారని భర్త రఫీ ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సదరు మహిళ, ఆమె సోదరులు పిలిపించి మర్యాదపూర్వకంగా మాట్లాడి పంపామని స్పష్టం చేశారు.

మేడారానికి బస్సు చార్జీలు ఖరారు

18 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక సర్వీస్‌లు
- 53 ప్రత్యేక పాయింట్ల నుంచి జాతరకు భక్తుల చేరవేత
- దూరాన్ని బట్టి పెరిగిన చార్జీలు

హన్మకొండ : ఆర్టీసీ యాజమాన్యం.. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు చార్జీలు ఖరారు చేసింది. జాతరకు 6 వేల బస్సులు నడుపనుంది. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్ పాయింట్ల నుంచి మేడారానికి బస్సులు ప్రారంభం కానున్నాయి. 2022 జాతరలో 2800 బస్సులు నడపగా, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన క్రమంలో ఈసారి 6 వేల బస్సులు నడిపేలా ప్రణాళిక ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో పెద్దలు, పిల్లలకు వేర్వేరు చార్జీలు రూపొందించింది. గత జాతరతో పోలిస్తే బస్సు చార్జీలు పెరిగాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులకు దూరాన్ని బట్టి పెద్దలకు రూ.20 నుంచి రూ.130 వరకు చార్జీలు పెరిగాయి. పిల్లలకు రూ.10 నుంచి రూ.80 వరకు పెరిగాయి. డీలక్స్ బస్సులకు పెద్దలకు రూ.80 నుంచి రూ.140 వరకు, పిల్లలకు రూ.30 నుంచి రూ.80 వరకు పెరిగాయి. సూపర్ లగ్జరీకి పెద్దలకు రూ.100 నుంచి రూ.200 వరకు, పిల్లలకు రూ.70 నుంచి రూ.120 వరకు, రాజధాని ఏసీ బస్సులకు పెద్దలకు రూ.130 నుంచి రూ.220 వరకు పిల్లలకు రూ.110 నుంచి రూ.180 వరకు పెరిగాయి. కాగా, భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర వ్యాప్తంగా 53 ప్రత్యేక పాయింట్ల (ప్రదేశాలు) నుంచి ప్రత్యేక బస్సులు నడుపనుంది.

మేడారం ముచ్చట్లు



బస్సు చార్జీల వివరాలు

ఎక్స్‌ప్రెస్ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.250	రూ.140	రూ.200	రూ.110
కాజీపేట	250	140	200	110
వరంగల్	250	140	200	110
జనగామ	370	210	290	160
హైదరాబాద్	550	310	450	240
హైదరాబాద్ (పెరిఫెరల్స్)	600	330	470	250
స్టేషన్ ఘన్‌పూర్	310	180	250	140
నర్సంపేట	250	150	200	110
కొత్తగూడ	300	170	240	130
పరకాల	250	140	190	110
చిట్యాల	250	140	200	110
మహబూబాబాద్	350	200	270	140
గూడూరు	280	160	230	130
తొర్రూరు	350	190	280	150
వర్ధన్నపేట	300	170	230	130
ఆత్మకూరు	210	120	160	90
మల్లంపల్లి	180	110	140	80
ములుగు	150	90	120	70
భూపాలపల్లి	220	130	180	100
గణపురం(ములుగు)	200	120	150	80
జంగాలపల్లి	150	90	110	60
పస్రా	80	50	60	40
గోవిందరావుపేట	100	60	70	40
తాడ్వాయి	60	40	40	30
గోదావరిఖని	370	200	300	160
హుస్నాబాద్	350	190	280	150
హుజూరాబాద్	310	170	250	140
కరీంనగర్	380	210	320	170
పెద్దపల్లి	380	210	320	170
మంథని	320	180	260	140
8.ఇన్‌క్లైన్	370	200	300	160
ఇల్లందు	400	210	---	---
కొత్తగూడెం	350	190	280	150
భద్రాచలం	300	160	250	130
మణుగూరు	210	120	180	100
ఏటూరునాగారం	80	50	60	40
మంగపేట	110	70	90	50
పాల్వంచ	310	170	260	140
ఖమ్మం	480	250	410	210
కాళేశ్వరం	350	190	270	140
సిరొంచ(మహారాష్ట్ర)	370	200	300	160
కాటారం	260	150	210	120
ఆసిఫాబాద్	550	290	450	230
బెల్లంపల్లి	460	250	380	200
చెన్నూరు	420	230	340	180
మందమర్రి	450	240	370	190
మంచిర్యాల	410	220	---	---
శ్రీరాంపూర్	400	220	320	170
నార్లాపూర్ / చింతల్	40	30	30	30
చర్ల, వయా: ఏటూరునాగారం	250	140	190	100
వెంకటాపూర్	150	90	110	60
వాజేడు	120	70	100	60
పేరూరు	160	90	130	70

డీలక్స్ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.300	రూ.170	రూ.220	రూ.120
కాజీపేట	300	170	220	120
వరంగల్	300	170	220	120
జనగామ	420	240	320	180
హైదరాబాద్	650	360	500	270
హైదరాబాద్ (పెరిఫెరల్స్)	670	370	530	290

సూపర్ లగ్జరీ..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.350	రూ.200	రూ.250	రూ.130
కాజీపేట	350	200	250	130
వరంగల్	350	200	250	130
జనగామ	500	290	370	200
హైదరాబాద్	750	420	570	310
హైదరాబాద్ (పెరిఫెరల్స్)	800	440	600	320

రాజధాని ఏసీ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.450	రూ.360	రూ.320	రూ.250
కాజీపేట	450	360	320	250
వరంగల్	450	360	320	250
జనగామ	650	520	480	370
హైదరాబాద్	950	750	740	570
హైదరాబాద్ (పెరిఫెరల్స్)	1000	780	780	600

గరుడ ప్లస్ ఏసీ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.500	రూ.400	రూ.390	రూ.300
కాజీపేట	500	400	390	300
వరంగల్	500	400	390	300
జనగామ	750	590	570	440
హైదరాబాద్	1100	860	890	680
హైదరాబాద్ (పెరిఫెరల్స్)	1150	900	930	720

జాతరకు 6వేల బస్సులు


వరంగల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు


కుడా మైదానంలో భూమి పూజ చేస్తున్న వరంగల్-1 డీఎం మోహన్‌రావు

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీధర్

వరంగల్ చౌరస్తా: మేడారం సామక్క-సారలమ్మ జాతరకు భక్తులను తీసుకెళ్లడం, తిరిగి గమ్యస్థానాలకు చేర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 53 ప్రాంతాల నుంచి 6వేల బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో మేడారం జాతర బస్సుల ఏర్పాట్లకు పార్కింగ్, రాకపోకలు తదితర అంశాలంపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ, కాజీపేటలో బుధవారం నుంచి మేడారానికి బస్సులను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు సర్వీస్‌లు కొనసాగుతాయన్నారు. వరంగల్ బస్‌స్టేషన్ నుంచి 450 బస్సులు రోజూ 900 ట్రిప్పులు నడుస్తాయని పేర్కొన్నారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

ప్రత్యేకంగా ఏర్పాట్లు

వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌కు సమీపంలోని పాత పార్కు స్థలంలో బస్సుల పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. పార్కింగ్, బస్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా స్టేషన్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను మళ్లిస్తున్నారు. బస్సుల రాకపోకలు సవ్యంగా సాగేందుకు ప్రత్యేకంగా సీసీ రోడ్డు నిర్మించారు. ఆర్ఎం వెంట ఈడీ రాఘునాథ రావు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు

హన్మకొండ: భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కుడా (హయగ్రీవచారి) మైదానంలో మేడారం జాతర ప్రత్యేక బస్ పాయింట్ ఏర్పాటు పనులను ఆయన భూమి పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడా మైదానం నుంచి మేడారానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఇక్కడ బస్‌ల పార్కింగ్‌తో పాటు భక్తులు బస్సులోకి చేరేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్కడ నాలుగు క్యూలైన్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ క్యాంపు, మెడికల్ క్యాంపు, అల్పాహారం కోసం క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 18 నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ... కాళోజీ సెంటర్: ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 26 సెంటర్లలో 12,620 మంది, పదో తరగతి పరీక్షలకు 54 కేంద్రాల్లో 9,455 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి కాక మాధవరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలి

వరంగల్: జిల్లాలో హరితహారంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హరితహారం అమలుపై సంబంధిత శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సంవత్సరంలో 25.85 లక్షల మొక్కలు నాటాలన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై హర్షం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం పోషణ అభియాన్ పథకాల అమలు బాగుందని కేంద్ర ప్రభుత్వ సెక్షన్ ఆఫీసర్లు తెలిపారని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ సెక్షన్ ఆఫీసర్స్ జిల్లాలో పర్యటించి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారన్నారు.

పరిపాలనలో మార్పు చూపండి

- ప్రభుత్వ లోగో మార్చడం కాదు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: 'ప్రభుత్వ అధికారిక లోగోను మార్చడం కాదు. పరిపాలనలో మార్పు చూపాలి' అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లోగో నుంచి కాకతీయ తోరణం, చార్మినార్ తీసేయాలనే నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కాకతీయ తోరణాన్ని తొలగించాలని కేబినెట్‌లో చర్చ వచ్చినప్పుడు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎందుకు అభ్యంతరం చెప్పలేదని మంత్రులు సీతక్క, కొండా సురేఖ తీరుపై ధ్వజమెత్తారు. త్వరలో అన్ని వర్గాల ప్రజలతో సమావేశమై మరో పోరాటాన్ని చేపడతామన్నారు. కృష్ణా నది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ.. ఈనెల 13న నల్లగొండలో నిర్వహించనున్న సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీటి ప్రాజెక్టులను కేంద్రం చేతికి అప్పగించడంపై బీఆర్ఎస్ మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ అర్బన్ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. కాకతీయ కళాతోరణాన్ని గేట్ వే ఆఫ్ వరంగల్‌గా పిలిచేవారని గుర్తు చేశారు. రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, 'కుడా' మాజీ చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, నాయకులు రజనీకాంత్, నాగేశ్వరరావు, నయీముద్దీన్, లక్ష్మీనారాయణ, రవీందర్, కేశవరెడ్డి, ఖుద్దూస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

నేడు విదేశీ ప్లేస్‌మెంట్‌పై అవగాహన సదస్సు

కాళోజీ సెంటర్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అర్హత, నైపుణ్య, సెమీ స్కిల్డ్ కార్మికులకు చేపడుతున్న విదేశీ ప్లేస్‌మెంట్‌పై నేడు (మంగళవారం) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అప్‌డేట్ చేసిన రెజ్యూమ్, సంబంధిత డాక్యుమెంట్‌లతో కిషన్‌పురలోని చైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలోని టాస్క్ రీజినల్ సెంటర్‌కు హాజరు కావాలన్నారు.

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

- ఎట్టకేలకు సీఐలకు స్థానచలనం

కాజీపేట అర్బన్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ సోమవారం మల్టీజోన్-1లో భారీగా సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 11 మంది సీఐలకు ట్రాన్స్‌ఫర్స్ అండ్ పోస్టింగ్ ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరున్నర సంవత్సరాలుగా ఒకే ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐలకు ఎట్టకేలకు స్థాన చలనం కలిగింది. సీహెచ్.నీరజ- డీటీఎఫ్ వరంగల్ నుంచి డీటీఎఫ్ మహబూబాబాద్‌కు, బి.కృష్ణ డీటీఎఫ్ మహబూబాబాద్ నుంచి ఖమ్మం-1 టౌన్‌కు, బి.చంద్రమోహన్ ఖిలా వరంగల్ నుంచి ఖమ్మం-2 టౌన్‌కు, కె.జగన్నాథరావు పరకాల నుంచి నేలకొండపల్లికి, సీ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భూపాలపల్లి నుంచి సత్తుపల్లికి, ఎం.ప్రశాంతి కాటారం నుంచి సింగరేణికి, బి.కరుణశ్రీ ఐఎంఎల్ డిపో-1 హనుమకొండ నుంచి డీటీఎఫ్ ఖమ్మానికి, టి.శ్రీనివాసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ నుంచి హుజూరాబాద్‌కు, ఎం.మాధవీలత ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ నుంచి జమ్మికుంటకు, ఎల్.రామకృష్ణ హనుమకొండ నుంచి చెక్‌పోస్ట్ యాంచా, ఫకీరా ఏటూరునాగారం నుంచి మంబోజీపల్లి, మెదక్‌కు బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు వచ్చిన వారు..

జి.దుర్గా భవాని హుజూరాబాద్ నుంచి హనుమకొండకు, కె.రాజు ఖమ్మం-1 టౌన్ నుంచి ఖిలా వరంగల్‌కు, ఎస్.ప్రభాకర్‌రెడ్డి జగిత్యాల నుంచి వరంగల్ అర్బన్‌కు, సీహెచ్.సామ్యూల్ ఆనంద్‌రావు సుల్తానాబాద్ నుంచి డీటీఎఫ్ వరంగల్ అర్బన్‌కు, ఎం.తిరుమలత కరీంనగర్ నుంచి ఐఎంఎల్ డిపో-1 హనుమకొండకు చెన్న నాగేశ్వర్‌రావు డీటీఎఫ్ కొత్తగూడెం నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్‌కు, కె.నాగయ్య అశ్వరావుపేటనుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్‌కు, పి.రజనీ బొల్లారం సంగారెడ్డి నుంచి ఏటూరునాగారం, ఎం.రమ్య వైరా నుంచి భూపాలపల్లికి, టి.నరేందర్ మంచిర్యాల నుంచి కాటారానికి బదిలీపై వచ్చారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట, వరంగల్, డోర్నకల్, భద్రాచలం మార్గాల్లో మంగళవారం నుంచి పలు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ఇటీవల పలు సెక్షన్‌లో ఇంజనీరింగ్ బ్లాక్‌లలో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి నడిచే రైళ్లు..

కాజీపేట-డోర్నకల్ (07753) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (07754) పుష్‌పుల్, డోర్నకల్-విజయవాడ (07755) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (07756) పుష్‌పుల్, భద్రాచలం రోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్‌లు మంగళవారం నుంచి యాథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఏసీపీలు సోమవారం రాత్రి బదిలీ అయ్యారు. వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్‌ను జగిత్యాల ఎస్‌డీపీఓగా బదిలీ అయ్యారు. వర్ధన్నపేటకు డీఎస్ఆర్‌పీ సికింద్రాబాద్ (యూ) నుంచి ఎ.నర్సయ్య వచ్చారు. మామునూరు సీపీ సతీష్‌బాబును డీపీజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. ఆయన స్థానంలో కొత్తగూడెం ఎస్‌డీపీఓ ఎస్‌కె అబ్దుల్ రహమాన్ వచ్చారు. జనగామ ఏసీపీ కె.దేవేందర్‌రెడ్డిని హనుమకొండ ఏసీపీగా బదిలీ చేయగా, ఆ స్థానంలో డీజీ కంట్రోల్ రూమ్ డీఎస్పీ ఎస్ఆర్.దామోదర్‌రెడ్డిని నియమించారు. హనుమకొండ ఏసీపీ వి.కిరణ్‌కుమార్‌ను నర్సంపేట ఏసీపీగా, నర్సంపేట ఏసీపీ పి.తిరుమల్‌ను వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు. వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ భోజరాజును ఇటీవల ఇచ్చిన పీటీసీ డీఎస్పీ పోస్టును క్యాన్సిల్ చేస్తూ రామగుండం సీసీఎస్ ఏసీపీగా నియమించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ కె.రవీందర్‌ను వరంగల్ పీటీసీ డీఎస్పీగా, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజును కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా బదిలీ చేశారు.

క్షేత్ర స్థాయిలో పట్టు సాగుపై అధ్యయనం

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: పట్టు రైతులకు జిల్లా అధికార యంత్రాంగం సహకారం అందిస్తుందని, క్షేత్రస్థాయిలో పట్టుసాగుపై అధ్యయనం చేస్తానని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సెంట్రల్ సిల్క్ బోర్డు, ప్రాంతీయ పట్టు పరిశోధ కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పట్టు కృషి మేళా, పట్టు రైతులు, డీలర్లు, వీవర్ల సమ్మేళనం నిర్వహించగా.. కలెక్టర్ సిక్తా పట్నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టు సాగుకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత మాట్లాడుతూ పట్టు రైతులు, డీలర్లు, వీవర్స్‌కు అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పట్టు సాగు అభివృద్ధి సాధించిందన్నారు. ఒకసారి మల్బరీ నాటితే 15 సంవత్సరాల వరకు పట్టు పురుగులు పెంచొచ్చని రైతులకు సూచించారు. మొదటి సంవత్సరం మాత్రమే పెట్టుబడి అవసరమన్నారు. నెలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందొచ్చని తెలిపారు. అనంతరం సీఎస్ఆర్‌టీ సైంటిస్టులు గాంధీదాస్, భాగ్య, రిటైర్డ్ డైరెక్టర్ ఖాద్రీ, సిద్దిపేట జిల్లా ములుగులోని ప్రాంతీయ పట్టు పరిశోధన స్థానం సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్.. రైతులకు పట్టు సాగులో మెళకువలు వివరించారు. ఈ సందర్భంగా పట్టు కరదీపికను కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు, శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, ప్రాంతీయ పట్టు పరిశోధ కేంద్రం టెక్నికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పట్టు సాగు కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు, శాస్త్రవేత్తలు